
గందరగోళం.. అయోమయం

- డీఎస్సీ అభ్యర్థుల్లో ఆందోళన
- రెసిడెన్స్ సర్టిఫికెట్ల జారీలో జాప్యం
- స్టడీ సర్టిఫికెట్ ఉంటేనే రెసిడెన్స్
- పొంతన లేని రెవెన్యూ అధికారుల తీరు

గురజాల: డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రభుత్వం విధించిన సవాలక్ష నిబంధనలతో ఇప్పటికే అభ్యర్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రెసిడెన్స్ సర్టిఫికెట్ల జారీలో రెవెన్యూ అధికారుల తీరుకు ఆందోళన చెందుతున్నారు. అభ్యర్థులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. స్టడీ సర్టిఫికెట్లు ఉంటేనే రెసిడెన్స్ సర్టిఫికెట్లు ఇస్తామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. వాస్తవంగా క్షేత్రస్థాయిలో అనేక పాఠశాలలు మూతబడి ఉన్నాయి. కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాలు కూడా ప్రస్తుతం పని చేయడం లేదు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులకు స్టడీ సర్టిఫికెట్లు దొరకడం కష్టంగా మారింది.

మండుటెండల్లో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ

డీఎస్సీ పరీక్షకు దరఖాస్తు చేసేందుకు కచ్చితంగా రెసిడెన్స్ సరిఫికెట్ ఉండాలనే నిబంధన పెట్టడంతో అభ్యర్థులు మండుటెండల్లో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. పల్నాడు జిల్లాలో నరసరావుపేట, గురజాల, సత్తెనపల్లి , వినుకొండ డివిజన్ పరిధిలోని అభ్యర్థులు ఈ సమస్యతో అల్లాడుతున్నారు. నిబంధనలు లేకుండా రెసిడెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వాలని విన్నవిస్తున్నారు.గతంలో ఆధార్ కార్డు మాత్రమే సమర్పిస్తే ఇచ్చేవారు. అయితే, దీన్ని కూడా కొన్ని ఏళ్ల నుంచి రెవెన్యూ కార్యాలయాల్లో ఇవ్వడం కూడా ఆపేశారు. ఆధారే రెసిడెన్స్‌గా ప్రామాణికంగా తీసుకోవాలని గతంలో రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేసినా ఫలితం లేదు.


గురజాల రెవెన్యూ కార్యాలయం

పొంతన లేకుండా సమాధానం

రెసిడెన్స్ సర్టిఫికెట్ జారీలో రెవెన్యూ అధికారులు తలా ఒక మాట చెబుతున్నారు. వీఆర్వో, తహసీల్దార్, కార్యాలయం సిబ్బంది ముగ్గురు మూడు మాటలు చెబుతుండటతో అభ్యర్థులు అయోమయం చెందుతున్నారు. ఏమి చేయాలో అర్థం కావడం లేదు. గతంలో మాదిరిగా ఆధార్ కార్డునే రెసిడెన్స్‌గా తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



రెసిడెన్స్ సర్టిపికెట్ కావాలంటే తప్పనిసరిగా స్కూల్‌లో చదువుకున్నట్లు స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలని అధికారులు చెబుతున్నారు. వేసవి సెలవులతో పాఠశాలను మూసేశారు. డీఎస్సీకి ఎలా దరఖాస్తు చేసుకోవాలో అర్థం కావడం లేదు.

–మేడికొండ చలపతిరావు, డీఎస్సీ అభ్యర్థి

ఐదు రోజులే గడువు

ప్రస్తుత డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రభుత్వం పెట్టిన మెలికతో అభ్యర్థులు అల్లాడిపోతున్నారు. పల్నాడు జిల్లావ్యాప్తంగా వేలాది మంది పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు. దరఖాస్తు సమర్పించడానికి గడువు ఐదు రోజులే ఉండటంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ అధికారుల వ్యవహార శైలితో మనోవేదనకు గురవుతున్నారు. ఎన్నడూ లేని విధంగా కొత్త నిబంధనలు పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

నాటుసారా రహిత మండలంగా తీర్చిదిద్దుదాం

మాచర్ల రూరల్: మాచర్ల మండలాన్ని నాటుసారా రహితంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖాధికారులు గ్రామ స్థాయిలో పనిచేయాలని తహసీల్దార్ బి. కిరణ్ కుమార్ కోరారు. కార్యాలయంలో గురువారం నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటుసారా నిర్మూలన కోసం మండలంలో ఏ కేటగిరి గ్రామాలుగా గుర్తించిన హసనాబాద్‌తండా, రేగులవరంతండా, చింతలతండాలలో గ్రామ కమిటీని ఏర్పాటు చేసి, నిరంతర నిఘా నిర్వహించాలని కోరారు. పాత కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న వారిపైనా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సారా తయారీని మాన్పించి ప్రత్యామ్నాయ జీవనోపాధి కోసం వారి కుటుంబ వివరాలు సేకరించాలని ఆదేశించారు. సారా తయారీ మానుకొని సాధారణ జీవితాన్ని గడిపే వారికి ప్రత్యేక ఆర్థిక రుణాలు అందించేందుకు జిల్లా కలెక్టర్లకు వారి జాబితాను పంపిస్తామని చెప్పారు. ముఖ్యంగా నాటుసారా తయారీకి ప్రధాన ముడిసరుకైన బెల్లం కొనుగోలు, అమ్మకాలను క్రమబద్ధీకరిస్తూ నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ఫారెస్టు భూముల్లో నాటుసారా తయారు చేస్తే ఫారెస్టు చట్టాలూ అమలు చేస్తామని రేంజర్ విజయలక్ష్మి తెలిపారు. నవోదయ 2.0 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలంతా సహకరించాలని ఎక్సైజ్ సీఐ వెంకటరమణ కోరారు. కార్యక్రమంలో డీటీ బత్తుల వాణి, ఆర్ఐ అనిల్ కుమార్, వీఆర్వో ఆరుముళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ కిరణ్ కుమార్

వైఎస్సార్ సీపీ నాయకుడి కుటుంబానికి పీఆర్కే పరామర్శ

కారెంపూడి: కుమారుడిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వైఎస్సార్ సీపీ నాయకుని కుటుంబాన్ని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) గురువారం పరామర్శించారు. పార్టీ కారెంపూడి ఎస్సీ సెల్ నాయకుడు మిద్దెపోగు పున్నయ్య కుమారుడు మహేష్ (26) కామెర్ల వ్యాధితో మృతి చెందాడు. పీఆర్కే కారెంపూడి వచ్చి మహేష్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పున్నయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండలంలోని


వైఎస్సార్ సీపీ నాయకులు పీఆర్కేతో పాటు వెళ్లి పున్నయ్య కుటుంబాన్ని పరామర్శించారు.

క్లుప్తంగా

ఎస్టీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కారెంపూడి: స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో ఐదవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి. వేణుగోపాలరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. మొత్తం 40 సీట్లలో ఎస్టీలకు– 32, ఎస్సీలకు– 5, బీసీలకు– 2, ఓసీలకు– 1 సీటు కేటాయించనున్నట్లు తెలిపారు. పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన ఖాళీలను ఎస్టీ విద్యార్థులతో భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులంతా ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తులను పాఠశాలలో అందించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

పీటీజీ పాఠశాలలో ....

విజయపురిసౌత్: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల(పీటీజీ)లో 3వ తరగతి ప్రవేశానికి అర్హత కలిగిన ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓసీ విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలని ప్రిన్సిపాల్ పాన్నూరి శామ్యూల్ జోబ్ గురువారం తెలిపారు.4వ తరగతి నుంచి 9 వరకు ఖాళీల భర్తీకి చెంచు విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. పాఠశాలలో ప్రభుత్వం కల్పించే అన్ని సౌకర్యాలు ఉచితంగా పొందవచ్చని తెలిపారు.

ఆదర్శ పాఠశాలకు 20మంది విద్యార్థుల ఎంపిక




దాచేపల్లి : స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలో మాదినపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని ఉపాధ్యాయుడు సీహెచ్. కోటేశ్వర రావు గురువారం తెలిపారు. పాఠశాల నుంచి 20మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు హాజరు కాగా వారిలో అంతా సీట్లు సాధించారని ఆయన చెప్పారు. టి. కార్తిక 89మార్కులు సాధించి టాపర్‌గా, వి. నందితారెడ్డి 86మార్కులతో ద్వితీయస్థానంలో నిలిచినట్లు ఆయన వెల్లడించారు. వీరితో విద్యార్థులు హరి శంకర్, జయదేవ్, వెంకట జగదీష్, వెంకట సౌమ్య, జాస్మిన్, మనీషా, సౌజన్య, శ్రీనిధి, శిరిష, నాగలక్ష్మి, ప్రవల్లిక, శశికుమార్, మాధవి, అమర్‌నాథ్, అజయ్, మనోజ్, నవీన్‌కుమార్‌లు సీట్లు సాధించినట్లు పేర్కొన్నారు.

వనబాల అలంకరణలో వాసవీ మాత



పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో గల వాసవీ అమ్మవారి దేవస్థానంలో గురువారం జన్మదినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారు వనబాల అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

విజయపురి సౌత్: బైక్ అదుపు తప్పి బోల్తా పడటంతో యువకుడు మృతి చెందిన సంఘటన మాచర్ల మండలం కొత్తూరు సమీపంలో గురువారం చోటు చేసుకుంది.కొత్తూరు గ్రామానికి చెందిన అమరబోయిన శ్రీకాంత్(23) ద్విచక్ర వాహనంపై తాళ్లపల్లి వెళ్తుండగా కొత్తూరు శివారులోని కుడి కాలువ సమీపం వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తా పడింది.దీంతో శ్రీకాంత్ తీవ్ర గాయాలు పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



విజయపురి సౌత్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మాచర్ల జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీనివాస్ కల్యాణ్ అన్నారు. విజయపురిసౌత్ లో గురువారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.చట్టం దృష్టిలో అందరూ సమానులేనని, అందరికీ న్యాయ సేవలు అందించాలన్నదే తమ ఉద్దేశమని తెలిపారు. ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో న్యాయ సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో న్యాయవాదులు జి.వెంకటేశ్వరరావు, చందన్ నాయక్, భవన నిర్మాణ కార్మికులు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉద్యమిద్దాం.. హక్కులు సాధించుకుందాం !

- సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకుల పిలుపు
- నియోజకవర్గంలో ఘనంగా మేడే వేడుకలు

మాచర్ల రూరల్: హక్కులు, ఎనిమిది గంటల పనిదినాల కోసం పోరాటం చేసి ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించిన కార్మికుల ఉద్యమ స్ఫూర్తిని నిదర్శనంగా తీసుకొని ఐక్యంగా ముందుకు పోదామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ఆంజనేయులు నాయక్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం ఏరియా కార్యదర్శి బండ్ల మహేష్, వై. సురేష్, ఎస్. వెంకటరత్నం, బత్తుల మహేష్, కొమెర రమణ, విజయ్, సుధాకర్ పాల్గొన్నారు.


మాచర్లలో సీఐటీయూ ఆధ్వర్యంలో వేడుకలు


మాచర్ల కేసీపీ సిమెంట్స్ ఫ్యాక్టరీ ఆవరణలో..


రెంటచింతల సీపీఐ కార్యాలయం వద్ద..


కారెంపూడిలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి


రెంటచింతల విద్యుత్ కార్యాలయం వద్ద..

ఐఎన్‌టీయూసీ నేతృత్వంలో...

స్థానిక కేసీపీ సిమెంట్స్ ఫ్యాక్టరీ ఆవరణలో ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి విస్సా క్రాంతి కుమార్ నేతృత్వంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.ఎల్. నారాయణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కె. శ్రీనివాసరెడ్డి, ఓర్సు శివయ్య, కాశయ్య, డి చలపతి రావు, చెన్నా, మురళీకృష్ణ పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో

ఉద్యమాల ద్వారానే హక్కుల సాధన సాధ్యమని, మేడే ఆవిర్భావ దినోత్సవాన్ని ఆశయంగా చేసుకొని ఐక్యతతో ముందుకుపోదామని సీపీఐ ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి కోరారు. మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సీపీఐ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అబ్రహం లింకన్, ఉల్లిగడ్డల నాగేశ్వర రావు, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి మిద్దెపోగు బాబూరావు, తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గాజుల చెన్నయ్య, సంఘ నాయకులు బత్తుల కోటేశ్వరరావు, వెంకటస్వామి, మౌలాలి, సుధాకర్, ఉప్పుతోళ్ల అంజి, రామదాసు, కొండలు, బత్తిన వెంకటేశ్వర్లు, పుల్లారావు పాల్గొన్నారు.

ఐక్యతతోనే హక్కులు సాధన

గురజాల : ఐక్యతతోనే హక్కులను సాధించుకోగలమని సీపీఐ జిల్లా నాయకుడు షేక్ హుస్సేన్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో మేడే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు, ఉషా సెంట్రింగ్ వర్క్స్ అధ్యక్షుడు పేరయ్య పాల్గొన్నారు.

రెపరెపలాడిన అరుణ పతాకాలు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో మేడే సందర్భంగా గురువారం వాడవాడలా అరుణ పతాకాలు రెపరెపలాడాయి. సీపీఐ స్తూపం వద్ద మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు, ఎంసీపీఐయూ కార్యాలయం వద్ద డివిజన్ కార్యదర్శి ఎం. నాగేశ్వరరావు, స్థానిక నాపరాయి కార్యాలయ వద్ద కార్మిక నాయకులు, స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో విద్యుత్ అధికారులు, సిబ్బంది, జెట్టిపాలెం, మంచికల్లు, పాలువాయి గ్రామాలలో సీపీఐ నాయకులు మేడేను పురస్కరించుకుని జెండాలను ఎగురవేసి విప్లవ నినాదాలు చేసి మాట్లాడారు. కార్యక్రమాలలో సీపీఐ పార్టీ నాయకులు మామిడి లాజర్, అమరా రపు సామ్యూల్ జాన్, ఏలూరి నాగార్జున, చేవూరి శ్రీనివాసరావు, గొడుగు పూర్ణ చంద్ర రావు, సంజీవ రావు, దేరంగుల శ్రీనివాసరావు, విద్యుత్ అధికారులు ఎస్. శ్రీనివాస చారి, ఎం. వెంకటేశ్వర్లు, వి. అచ్యుత్, శ్రీను, గణపతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కారెంపూడిలో ఘనంగా వేడుకలు

కారెంపూడి: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను కారెంపూడిలో కార్మికులు గురువారం జరుపుకున్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో కామ్రేడ్ డాక్టర్ ఆదినారాయణ కాలనీలో మేడే పతాకాన్ని జిల్లా రైతు సంఘం నాయకులు మేకపోతు శ్రీనివాసరెడ్డి, సీపీఐ నాయకుడు షేక్ సైదా తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికులు ప్రదర్శన నిర్వహించారు.

కార్మికులంతా ఐక్యంగా ఉండాలి

దాచేపల్లి : కార్మికులు ఐక్యంగా ఉండాలని టీటీడీ బోర్డు సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని గామాలపాడు గ్రామ సమీపంలోని సాగర్ సిమెంట్స్ వద్ద గురువారం జరిగిన మేడే వేడుకల్లో ఆయన పాల్గొని జెండా ఎగురవేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ జంగా సురేష్, కార్మిక నాయకుడు గద్దల వేదమణి, మందా బెంజిమెన్, శ్రీపతి ఏసోబు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు

పిడుగురాళ్ల: పట్టణంలో పలువురు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా గురువారం నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని మార్కెట్ యార్డులో గల సివిల్ సప్‌లై గోడౌన్‌లో కార్మికులు, ఆంధ్రబ్యాంక్ సెంటర్‌లో ఆటో యూనియన్ నాయకులు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, బత్తుల వెంకటేశ్వర్లు, రామారావు, రామకృష్ణ, యాకోబు, తిరుపతిరావు, ఎర్ర అబ్బాయి, కృష్ణ, అంగిడి వెంకటేశ్వర్లు, లక్ష్మి, మరియమ్మ పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో సభ్యత్వ కార్డుల పంపిణీ

పట్టణంలోని ఆదర్శ నగర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ నిర్వహించారు. సీపీఐ సీనియర్ నాయకులు అక్కినపల్లి బాలయ్య, నాయకులు షేక్ కరిముల్లా, షేక ఆషా, కొమ్ము కరుణమ్మ, వీరయ్య, షేక్ సాహెరా, వెంకట రమణ, రవి, వెంకటేష్, కృష్ణ పాల్గొన్నారు.


విజయపురి సౌత్‌లో జెన్‌కో క్వార్టర్స్ వద్ద జెండా ఆవిష్కరణ

విజయపురిసౌత్‌లో ఘనంగా వేడుకలు

విజయపురిసౌత్: మేడే వేడుకలను విజయపురి సౌత్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. జెన్కో క్వార్టర్స్ వద్ద ఏఐటీయూసీ మాచర్ల నియోజకవర్గ కార్యదర్శి మిద్దెపోగు బాబూరావు జెండా ఆవిష్కరించారు. లాంచీ స్టేషన్ వద్ద ఏపీ టూరిజం కాంట్రాక్టు మాన్ పవర్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పులుసు వీరారెడ్డి,అంబేడ్కర్ సెంటర్‌లో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్లా ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. కార్మికులు స్వీట్లు పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ఏఐటీయూసీ సెక్రటరీ తుమ్మనాథం రెడ్డి,భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు బిర్నిడి నాగేశ్వరరావు,సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్, ఇశ్రాయేలు పాల్గొన్నారు.


సాగర్ సిమెంట్స్ వద్ద మేడే వేడుకలు


పిడుగురాళ్లలో సీఐటీయూ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ

కూటమి పాలనలో రైతులు, కార్మికులు కన్నీరు

పిడుగురాళ్ల: కూటమి పాలనలో రైతులు, కూలీలు, సున్నపు బట్టీ కార్మికులు సైతం అనేక ఇబ్బందులు పడుతున్నారని గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వీరభద్రుని రామిరెడ్డి ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కార్మికులు కళకళలాడాల్సిన పరిస్థితి లేకుండాపోయిందన్నారు. రైతులు, కూలీలు, కార్మికులు కన్నీరు పెడుతున్నారని తెలిపారు. అన్ని రంగాలు కుదైనట్లు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, బాబును గెలిపించి తప్పు చేశామని ప్రజలు బాధపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. పాలు ఇచ్చే ఆవులను కాదని ఎగిరితన్నే దున్నపోతును తీసుకొని వచ్చామని బాధపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగ అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, ఆర్టీఐ మాజీ కమిషనర్ రేపాల శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చింతా సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు కత్తెరపు వాసుదేవరెడ్డి, కాంద్రగుంట శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

సంతోషరావుకు మాజీ ఎమ్మెల్యే కాసు పరామర్శ



పిడుగురాళ్ల: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చల్లగుండ్ల సంతోషరావు అనారోగ్యంతో పల్నాడు హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయన్ను గురువారం గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పరామర్శించారు. సంతోషరావుతో మాట్లాడి ధైర్యం చెప్పారు. డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్‌ను సంతోషరావు ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నేతలు చల్లగుండ్ల స్వామి, నరసింహారావు యాదవ్, సుధాకర్ పాల్గొన్నారు.

జిల్లా చెస్ అండర్- 19 పోటీలకు నలుగురు ఎంపిక



మాచర్ల రూరల్: పల్నాడు జిల్లా చెస్ డెవలప్‌మెంట్ అసోసియేషన్, ఆంధ్రా చెస్ అసోసియేషన్ నేతృత్వంలో అండర్- 19 టోర్నమెంట్ పోటీలు గురువారం స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో నిర్వహించారు. పల్నాడు చెస్ అకాడమి కోచ్ కె. కిరణ్ కుమార్ నేతృత్వంలో నిర్వహించిన ఎంపికలో బాలుర విభాగంలో మొదటి రెండు స్థానాల్లో మాగ్నెస్, నీల్ ప్రజ్ఞాన్, బాలికల విభాగంలో హృతిక్ రెడ్డి, శ్రీనిహారిక ఎంపికయ్యారు. ఈ నలుగురు ఈ నెల 3,4 తేదీల్లో విజయవాడలో జరిగే పోటీలో పాల్గొంటారన్నారు. మొట్టమొదటి సారిగా పల్నాడు జిల్లా అండర్– 19 జట్టు ఎంపిక పోటీలను మాచర్లలో నిర్వహించుకోవడం శుభపరిణామమని, రానున్న రోజుల్లో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లనూ నిర్వహిస్తామని చెస్ కోచ్ కిరణ్ తెలిపారు. అనంతరం పోటీలో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నాదెండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన మెరుగైన విద్య లభిస్తుందని హెచ్‌ఎం వి విజయలక్ష్మీ చెప్పారు. గణపవరం ఎంపీపీఎస్ మెయిన్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం చిన్నారుల కోలా హలం నడుమ ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ ఏడాది 170 మంది విద్యార్థులు, తొమ్మిది మంది ఉపాధ్యాయులతో పాఠశాలలో మెరుగైన విద్య, మంచి ఫలితాలు సాధించామన్నారు. అనంతరం టీచర్ కొప్పుల సంధ్య ఆధ్వర్యంలో 22 మంది చిన్నారు లు నిర్వహించిన కోలాటం, భరత నాట్యం ప్రద ర్శన ఆకట్టుకుంది. విద్యార్థులకు కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వలేటి హిమవంతరావు, దాతలు బహుమతులు అందించారు.

ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మార్చాలి

ప్రాజెక్ట్ డీపీఎం కె.అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మార్చే దిశగా సిబ్బంది పనిచేయాలని ప్రాజెక్ట్ డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ పొలంలో ఖరీఫ్ పంట వేసే ముందుగా భూమిని ఖాళీగా ఉంచకుండా 30 రకాల విత్తనాలు బీజామృతంతో శుద్ధి చేసి పొలంలో చల్లాలని తెలిపారు. 45 రోజుల తరువాత భూమిలో కలయ దున్నడం వలన ప్రధాన పంటకు కావాల్సిన సూక్ష్మపోషకాలు అభివృద్ధి చెంది పంట ఆరోగ్యం,భూమి సారవంతం, పంట దిగుబడి కూడా పెరుగుతుందని తెలిపారు. గ్రామాల్లోని రైతులు మొత్తం విస్తీర్ణంలో ఈ సాగు విధానాన్ని పాటించే విధంగా సిబ్బంది కృషిచేయాలని తెలిపారు. జిల్లాలోని 28 మండలాల్లో 222 వివో సంఘాలు పరిధిలో 132 గ్రామ పంచాయతీల్లో జీరో బడ్జెట నేచురల్ ఫార్మింగ్ విధానం కొనసాగుతుందని తెలిపారు.


మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

పదో తరగతి ఫలితాలపై ఉపాధ్యాయులు సమీక్ష

నూజెండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ప్రణాళికబద్ధంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని విద్యా కమిటి చైర్మన్ ముప్పాళ్ల శ్రీనివాసరావు అన్నారు. గురువారం నూజెండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి పరీక్ష ఫలితాలపై ఉపాధ్యాయుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కల్గిలా నాణ్యమైన విద్యను అదించాలన్నారు. ఈవిద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలు 120 మంది రాయగా 81 మంది ఉత్తీర్ణిత శాతం దిగువన ఉండటం బాధకరమన్నారు. భవిష్యత్‌లో మెరుగైన ఫలితాల కోసం 6వ తరగతి నుంచే వెనుకబడిన విద్యా ర్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. అలాగే త్వరలో జరగనున్న పదో తరగతి సప్లమెంటరి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణిత సాధించేలా ఉపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. అనంతరం సబ్జెక్టుల వారిగా ఉపాధ్యాయులతో మాట్లాడి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై మాట్లాడినారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.